

అక్రమ రవాణాకు అడ్డుకట్టేది

గుర్రంకొండ మండలంలో వృక్ష సంపదను తరలిస్తున్న లారీలను అటవీ, రెవెన్యూ అధికారులు నిలిపి మామూళ్లు వసూలు చేసుకొని వదిలేస్తున్నారు. -10లో



పొట్టకూటి కోసం వచ్చి..

పొట్టకూటి కోసం బీహార్ నుంచి వచ్చిన ఇద్దరు కార్మికులు కరెంటు షాక్‌తో మృతి చెందిన సంఘటన పెద్దతిప్పసముద్రం మండలం కందుకూరులో జరిగింది. -10లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.190	రూ.230
రెండోరకం	రూ.130	రూ.180

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 156 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

వాటర్ అథారిటీ సీఈవోగా మురళీనాథ్‌రెడ్డి



మదనపల్లె: ఏపీ ఇన్ ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ అదనపు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ఆర్.మురళీనాథ్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జలవనరులశాఖలో వివిధప్రాంతాల్లో వివిధస్థాయిల్లో పనిచేసిన ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. హంద్రీ-నీవా, తెలుగుగంగ, గాలేరు-నగరి, వెలిగొండ, ఎస్ఆర్‌బీసీ, కుప్పం ఉపకాలువ పనుల్లోనూ, జలాశయాలు, సొరంగాల నిర్మాణాల్లో ఆయన పాత్ర కీలకం. మదనపల్లె హంద్రీ-నీవా ఎస్‌ఈగా ఉన్నప్పుడు ప్రాజెక్టు పనులను సత్వరమే పూర్తి చేయడమేకాక, కృష్ణా జలాలు ఆయన హయాంలోనే తరలివచ్చాయి. చీఫ్ ఇంజనీరింగ్ ఉద్యోగ విరమణ చేసిన ఆయన సేవలను వినియోగించుకోవాలని ప్రభుత్వం మళ్లీ అవకాశం కల్పించింది.

17 నుంచి జిల్లా జట్ల ఎంపిక

మదనపల్లె సిటీ: జిల్లా పాఠశాల క్రీడాసమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్‌గేమ్స్ బాల,బాలికల జట్లు ఎంపిక జరుగుతుందని ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ డాక్టర్ బాబు తెలిపారు. 17న రెజ్లింగ్,గ్రీకోరోమన్ విభాగాల్లో అండర్-17,-19 బాల,బాలికలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గుడిపాల మండలం నరహరిపేటలో, గుడిపాల మండలం తిమ్మిందా జడ్పీ ఉన్నత పాఠశాలలో అండర్-17,-19 సైక్లింగ్ జట్లు, చిత్తూరు విజయం కళాశాలలో అండర్-17,-19 మోడరన్ పెంటాతలాన్ జట్ల ఎంపిక జరుగుతుందన్నారు. కురబలకోట జెడ్పీ ఉన్నత పాఠశాలలో అండర్-17 వాలీబాల్ జట్ల ఎంపిక జరుగుతుందన్నారు. అండర్-19 కబడ్డీ జట్ల ఎంపిక ఏపీ మోడల్ స్కూల్ రెడ్డివారిపల్లెలో జరుగుతుందన్నారు. 18వతేదీన అండర్-14 బాస్కెబాల్, అండర్-19 రగ్బీ పోటీలు మదనపల్లె మండలం సీటీఎం జెడ్ ఉన్నత పాఠశాలలో జరుగుతాయన్నారు.

ప్రయాణికులకు తప్పని తిప్పలు



భాకరాపేటలో బస్సులు దొరక్క ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

సిద్దవటం: కర్నూలు జిల్లాలో ప్రధాని నరేంద్రమోదీ సభకు పెద్ద ఎత్తున ఆర్టీసీ బస్సులను కేటాయించారు. ఈ కారణంగా బుధవారం సాయంత్రం నుంచి బస్సులు అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గంటల తరబడి వేచి చూసినా బస్సులు రాకపోవడంతో పలువురు తమ ప్రయాణాలు వాయిదా వేసుకోగా, మరికొందరు ఇతర ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు. ఇలా తరచూ రాజకీయ సమావేశాల సందర్భంగా సామాన్యులను ఇబ్బందులకు గురి చేయడం తగదని పలువురు ప్రయాణికులు మండిపడ్డారు.

పోస్టర్ల ఆవిష్కరణ

రాయచోటి: ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించడానికి కౌశల్ పోటీలు ఉపకరిస్తాయని డీఈఓ కె సుబ్రమణ్యం అన్నారు. బుధవారం రాయచోటి డైట్ కళాశాలలో కౌశల్-2025 పోస్టర్లను ఆవిష్కరించారు. భారతీయ విజ్ఞాన మండలి, ఆంధ్రప్రదేశ్ సైన్స్ సిటీ ఏపీకాస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో కౌశల్ సైన్స్ ప్రతిభాన్వేషణ పోటీలు-2025 నిర్వహిస్తోందని ఆయన పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ యాజమాన్యంలో ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు తప్పనిసరిగా పాఠశాల కో-ఆర్డినేటర్ల చేత 8,9,10వ తరగతుల విద్యార్థులను ఈనెల 24 లోగా రిజిస్టర్ చేయించాలన్నారు. వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీవీఎంఏజీ.ఒఆర్‌జీ, కౌశల్ పోటీలకు సంబంధించి ఇతర సమాచారం కోసం 8985541699, 994 95 20704 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

అటవీప్రాంతంలో తనిఖీలు



కొండూరు బీట్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

సిద్దవటం: ప్రతి నెల రాష్ట్రంలో అనుమానిత అటవీ ప్రాంతాల్లో తనిఖీలు చేపడతామని విజిలెన్స్ డీఎఫ్ఓ ధర్మదీక్షిత్ తెలిపారు. సిద్దవటం అటవీ శాఖ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ కొండూరు ఫారెస్ట్ బీట్ పరిధిలో కూంబింగ్ నిర్వహించామని తెలిపారు. ప్రపంచంలోనే విలువైన, ఖరీదైన ఎర్రచందనం అటవీ సంపద కాపాడే బాధ్యత అందరిపై ఉందన్నారు. విజిలెన్స్ ఎఫ్ఆర్‌ఓ శంకరయ్య, ఎఫ్ఎస్ఓ వెంకటేశ్వర్లు, ఎఫ్‌బీఓ విజిలెన్స్ సురేంద్రబాబు, సిద్దవటం అటవీ శాఖ అధికారిణి కళావతి, డీఆర్ఓ ఓబులేసు పాల్గొన్నారు.

ప్రకృతి శాపమా! మానవ తప్పిదమా?

- హంద్రీ-నీవా కాలువ తరిగోడు ఎత్తిపోతల పథకం ఆగిపోయినా ఎగువ నుంచి వస్తున్న నీళ్లు
- తెల్లవారుజాము రెండు గంటలకు చెర్లోపల్లెలో నీటిని ఆపేశారు
- పరిశీలించిన కలెక్టర్ నిశాంత్ కుమార్



బి.కొత్తకోట మండలం తరిగోడు ఎత్తిపోతల సమీపంలో తెగిన పుంగనూరు ఉప కాలువ

బి.కొత్తకోట: ప్రకృతి శాపమో, అధికారుల తప్పిదమో కాని బి.కొత్తకోట మండలంలోని తరిగోడు ఎత్తిపోతల పథకానికి 600 మీటర్ల దూరంలో హంద్రీ-నీవా ప్రాజెక్టులో భాగమైన పుంగనూరు ఉపకాలువకు బుధవారం ఉదయం 10 గంటల సమయంలో గండి పడింది. దీంతో చెర్లోపల్లె జలాశయం నుంచి ఇక్కడికి వస్తున్న కృష్ణాజలాలు పక్కనే ఉన్న చెరువులు, వాగుల్లోకి ప్రవహిస్తున్నాయి. మంగళవారం రాత్రి 10 గంటలకు సమస్య ఉత్పన్నమైతే వాటిని సరిచేసేందుకు అధికారులకు 12 గంటలకుపైగా సమయం పట్టింది. ఫలితంగా కాలువలో ప్రవహిస్తున్న, ఎగువనుంచి వస్తున్న నీళ్లన్నీ ముందుకు సాగలేక గండిపడిన చోటనుంచి బయటకు ప్రవహిస్తున్నాయి.

ఎత్తిపోతల పథకం పనిచేయక..

పుంగనూరు ఉపకాలువ శ్రీసత్యసాయిజిల్లా కదిరి సమీపంలోని చెర్లోపల్లె జలాశయం నుంచి ప్రారంభం అవుతుంది. ఇక్కడి నుంచి కృష్ణాజలాలను కాలువలోకి విడుదల చేస్తున్నారు. మంగళవారం కాలువలో 300 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉంది. ఈ నీళ్లను సత్యసాయిజిల్లా బొంతలపల్లె ఎత్తిపోతల పథకం నుంచి ఎత్తిపోస్తే జిల్లాలోని పెద్దతిప్పసముద్రం మండలంలోని ప్రవేశిస్తాయి. ఇక్కడి పీటీఎం ఎత్తిపోతల నుంచి ఎత్తిపోసే నీళ్లు కాలువలో ప్రవహిస్తూ బి.కొత్తకోట మండలంలోని తరిగోడు ఎత్తిపోతల వద్దకు చేరుకుంటాయి. మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో భారీ ఉరుములు, మెరుపుల కారణంగా తరిగోడు ఎత్తిపోతల పథకానికి విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడింది. దీంతో నీటిని ఎత్తిపోసే నాలుగు పంపులు ఆగిపోయాయి. ఒక్కసారిగా నీళ్లు కాలువ లోనే ఆగిపోవడం, ఆపై బొంతలపల్లె, పీటీఎం పథకాల నుంచి నీళ్లు ఎత్తిపోస్తూనే ఉండటంతో అధికస్థాయిలో తరి గోడు ఎత్తిపోతల పథకం వద్దకు చేరుకున్నాయి. నీళ్లు ముందుకు వెళ్లే ఆస్కారం లేకపోయింది. కాలువ ఎత్తులోకి చేరిగిపోర్లడం ప్రారంభమైంది. నీటి ధాటికి తట్టు కోలేక, అప్పటికే కురుస్తున్న వర్షంతో ఎత్తిపోతల పథకానికి సమీపంలోని కాలువకు గండిపడి తెగిపోయింది.

2 గంటలకు సమాచారం

తరిగోడు ఎత్తిపోతల పథకం పనిచేయడం లేదని ప్రాజెక్టు అధికారులు చెర్లోపల్లె జలాశయం అధికారులకు బుధవారం తెల్లవారుజామునరెండు గంటలకు సమాచారం ఇచ్చారు. దీంతో అక్కడినుంచి నీటి విడుదలను నిలిపివేశారు. అప్పటికే నీటి ప్రవాహం 300 క్యూసెక్కులు ఉండటంతో ఎక్కడా ఆగే పరిస్థితి లేకపోయింది. దీనికితోడు బొంతలపల్లె, పీటీఎం పథకాలు నిరంతరంగా నీటిని ఎత్తిపోస్తూనే ఉన్నాయి. ఫలితంగా కాలువ నిండిపోయింది. పరిస్థితిని పసిగట్టి రాత్రి 10 గంటల సమయానికే చెర్లోపల్లె నుంచి నీటి విడుదల ఆపివుంటే కాలువ తెగే అవకాశాలు తక్కువగా ఉండేదని అంటున్నారు. నీటి ప్రవాహం స్థితి అటుంచితే..విద్యుత్ సరఫరా సమస్య బుధవారం ఉదయం 10 గంటల తర్వాతే పరిష్కారం అయ్యింది. గడచిన 12 గంటల్లో నీటి అధిక ప్రవాహం, కాలువ తెగడం జరిగిపోయింది. అయితే తరిగోడు ఎత్తిపోతల పథకం ఆగిపోవడం వల్ల పైనుంచి వచ్చే నీళ్లు ఎక్కడ ఆగిపోయినా ఏదో ఒకచోట కాలువ తెగే అవకాశం ఉందని ప్రాజెక్టు అధికారులు స్పష్టం చేస్తున్నారు.

ఎస్ఈ మకాం

కాలువ తెగిన విషయం తెలుసుకున్న ప్రాజెక్టు ఎస్ఈ విఠల్‌ప్రసాద్, ఈఈలు అమరనాథరెడ్డి, రాజగోపాల్, సిబ్బందితో మకాం వేశారు. తెగిన కాలువ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించేందుకు కృషి చేస్తున్నారు. ఉదయం నుంచి బుధవారం రాత్రంతా అక్కడే ఉండి పరిస్థితిని పరిశీలిస్తున్నారు.

పరిశీలించిన కలెక్టర్

బుధవారం ఉదయం కాలువకు గండిపడిన ప్రదేశాన్ని కలెక్టర్ నిశాంత్‌కుమార్ పరిశీలించారు. గండి పడిన విషయాన్ని ఎస్ఈ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే ఇక్కడికి చేరుకున్నారు. ప్రాజెక్టు అధికారులను దీనికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. గండి పడటానికి కారణాలను అధికారులు వివరించారు. గండిని తక్షణమే పూడ్చాల్సిన అవసరం ఉందని, ఎప్పటిలోగా పనులు పూర్తి చేస్తారని కలెక్టర్ కోరగా రెండు రోజుల్లో పనులు పూర్తి చేసి కాలువలోకి నీటిని పంపుతామని ఎస్ఈ విఠల్ ప్రసాద్ వివరించారు.

» నీళ్లు ఆగే పరిస్థితిలేదు

పైనుంచి కాలువలోకి ప్రవహిస్తున్న కృష్ణా జలాలు మరో 40 గంటలు గడిస్తేకాని నీటిని నిలుపుదల చేయడం సాధ్యం కాదని అధికారులు చెబుతున్నారు. కాలువలో ప్రస్తుతం 200 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉందని, 75 కిలోమీటర్ల ప్రవాహం పూర్తిగా ఆగిపోవాలంటే ఈ సమయం అవుతుందని చెప్పారు. ఇప్పటికే 20 నుంచి 25 ఎంసీఎ ఫీటీలు కాలువ నుంచి బయటకు వెళ్లాయని, మరో 200 ఎంసీఎఫ్‌టీలు చెరువులకు మళ్లే అవకాశం ఉందని అధికారులు చెప్పారు.

» అధికారులు చెబుతున్నది ఇదీ

మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో భారీ ఉరుములు, మెరుపులు వచ్చాయి. దీని ప్రభావానికి మూడుచోట్ల సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీన్ని గుర్తించడం కోసం రాత్రే చర్యలు చేపట్టినప్పటికీ సరఫరాలో లోపం ఎక్కడ అనేది గుర్తించడానికి సాధ్యం కాలేదు. చివరకు మూడుచోట్ల ట్రిప్ అయి మరమ్మతులకు గురైన విషయం గుర్తించారు. బుధవారం ఉదయం దీనికి మరమ్మతులు పూర్తి చేయించాం. గండిపడిన ప్రాంతాన్ని యుద్ధప్రాతిపదికన పూడ్చడానికి చర్యలు తీసుకుని రెండురోజుల్లో యథావిధిగా నీటిని తరలింపు చర్యలు చేపడతామని ఎస్ఈ విఠల్‌ప్రసాద్ చెప్పారు.



చెరువులోకి చేరుతున్న నీళ్లు

వణికిన దళితవాడ

కురబలకోట: హంద్రీనీవా పంప్‌హౌస్‌లో పవర్ లేక హంద్రీనీవా కాలువలో నీటి నిల్వ పెరిగి పొంగి ప్రవహించడంతో పక్కనున్న దళితవాడ వాసులు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని రాత్రంతా బిక్కుబిక్కుమంటూ కాలం గడిపిన సంఘటన మంగళవారం రాత్రి కురబలకోట మండలంలో చోటుచేసుకుంది. కాలనీవాసులు, హెచ్ఎన్ఎస్ అధికారుల కథనం మేరకు..పుంగనూరు ఉప కాలువకు సంబంధించి అంగళ్లు వద్ద పంప్ హౌస్ ఉంది. రాత్రి వేళ ఉన్నట్టుండి పవర్ పోయింది. ఆలైన్‌కు సంబంధించి మరో చోట పిడుగులు పడి పవర్ ట్రిప్ అయినట్లు అధికారులు చెబుతున్నారు. లిఫ్ట్ పంప్ హౌస్ మోటార్లు ఆగిపోయాయి. హెచ్ఎన్ఎస్ అధికారులు జోక్యం చేసుకోవడంతో కొంత సేపటి తర్వాత పంప్ హౌస్ కు పవర్ వచ్చింది. దీంతో పంపింగ్ మోటార్లు పని చేయడం ప్రారంభించాయి. ఉదయాని కల్లా కాలువలో నీటి మట్టం యథాస్థితికి వచ్చింది. అప్పటి వరకు వణికిన దిగువున ఉన్న కాలనీ వాసులు ఒక్కసారిగా ఊపిరిపీల్చుకున్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

పడకేసిన వైద్యం

- కొనసాగుతున్న పీహెచ్‌సీ వైద్యుల సమ్మె
- వైద్యం అందక గ్రామీణులకు అవస్థలు



వైద్యాధికారి రాకపోవడంతో ముక్కావారిపల్లి ఆరోగ్య కేంద్రంలో వేచి ఉన్న రోగులు

రాయచోటి/ఓబులవారిపల్లె: కూటమి ప్రభుత్వ హయాంలో వైద్యానికి సుస్తీ చేసింది.రెండేళ్ల క్రితం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఉన్నతంగా వెలిగిన ప్రభుత్వ రంగ వైద్యం ఇప్పుడు దీనావస్థలో ఉంది. ఆరోగ్యంగా ఉన్న వైద్యాన్ని అనారోగ్యం పాలు చేసి మంచం పట్టేలా చేయడంలో కూటమి సర్కార్ సఫలీకృతమైంది. సమస్యల పరిష్కారానికి గత నెల 26వ తేదీ నుంచి దశల వారీగా ఏపీ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోషియేషన్ (ఏపీ పీహెచ్‌సీ డీఏ) ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. 2024 సెప్టెంబర్‌లో కూడా వైద్యులు సమ్మె చేశారు. ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించి, సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది. ఏడాది దాటినా హామీలు అమలుకాకపోవడంతో మరోమారు వైద్యులు ఆందోళన బాట పట్టారు.జ్వరాలతో ఆస్పత్రికి వచ్చే రోగులకు సరైన వైద్యం కరువైంది.ప్రభుత్వం సరైన ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టలేదన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు డెంటల్, స్కిన్, ఆర్థో, కంటి వైద్య నిపుణులను అక్కడక్కడా ఏర్పాటుచేసిన ఫలితాలు కనిపించలేదు.చాలాచోట్ల నర్సులు, సిబ్బంది అందిస్తున్న వైద్యంతో సరిపెట్టుకోవాల్సి వస్తోంది. బుధవారం ఓబులవారిపల్లె మండలం ముక్కావారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి రాకపోవడంతో రోగులు చాలాసేపు వేచి ఉండాల్సి వచ్చింది. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్న కారణంగా ప్రజలు రోగాల బారిన పడి ప్రభుత్వ వైద్య, ఆరోగ్య కేంద్రాలకు వెళ్తున్నారు. అక్కడ వైద్య సేవలు అందకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ వైద్యాధికారుల సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

లక్కిరెడ్డిపల్లి, చిన్నమండెం మండలాలు

పైలెట్ ప్రాజెక్టుకు ఎంపిక

జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి: వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయంలో మార్పులు.. పైలెట్ ప్రాజెక్టుకు జిల్లాలోని లక్కిరెడ్డిపల్లి, చిన్నమండెం మండలాలు ఎంపిక కావడం సంతోషకరమని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. రైతులు వాతావరణ మార్పులు వల్ల కలిగే ప్రభావాలకు సన్నద్ధంగా ఉండి ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో కలెక్టర్ ఆధ్వర్యంలో యునైటెడ్ నేషన్స్ వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్ రెండు రోజుల జిల్లాస్థాయి వర్క్‌షాప్‌లో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఉపాధి మార్గాల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇండియాలో ఒడిశా, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ మూడు రాష్ట్రాల్లో పైలెట్ ప్రోగ్రామ్‌గా ఎంపిక కావడం.. అందులో రాష్ట్రంలో అన్నమయ్య జిల్లాలోని వెనుకబడిన మండలాలుగా ఉన్న లక్కిరెడ్డిపల్లి, చిన్నమండెం ఎంపిక కావడం ఆనందించ దగ్గ విషయమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వాతావరణంలో మార్పులు రావడం పెద్ద సమస్యగా మారిందన్నారు. వర్షాలు కురిసే కాలంలో తక్కువగా ఉండటం, పంటలు పండే సమయంలో వర్షాలు రాకుండా ఆగిపోవడం, అలాగే చేతికి వచ్చే సమయంలో అకాల వర్షాలతో పంట నష్టం జరుగుతోందన్నారు. ఇలా వ్యవసాయ రంగం పూర్తిగా దెబ్బతింటోందన్నారు. లక్కిరెడ్డిపల్లి, చిన్నమండెం మండలాలలో రైతుల జీవనాధార కార్యక్రమాలు, పంట పద్ధతులు, వాతావరణ పరిస్థితులు తదితర అంశాలపై సమగ్ర అధ్యయనం చేసి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు, అధికారులు కలిసి ఒక సమగ్ర యాక్షన్ ప్లాన్ రూపొందించి ఈ ప్రాజెక్టు ద్వారా గరిష్ట ప్రయోజనం పొందేలా కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జాతీయ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ బాలాజీ త్రిపాఠి మాట్లాడుతూ ఈ పథకం మనదేశంలో మూడు రాష్ట్రాల్లో అమలవుతోందని, ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాలోని చిన్నమండెం, లక్కిరెడ్డిపల్లి మండలాలలోని ఇరవై గ్రామాలలో రైతుల జీవన విధానం, మార్పులకు దోహదమవుతుందని తెలిపారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా వ్యవసాయ అధికారి జి శివనారాయణ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో వర్షాభావ పరిస్థితుల వల్ల రైతాంగం వరుస కరువులను చవిచూడాల్సిన పరిస్థితి వస్తోందని,, వీటిని ప్రత్యామ్నాయంగా ఈ పథకం ద్వారా గ్రామస్థాయిలోని సన్నకారు రైతులకు ఉపయోగపడే విధంగా రూపకల్పన చేయాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ రైతు సాధికార సంస్థప్రతినిధి సౌమ్య జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారి బి వెంకట మోహన్, జిల్లా ఉద్యానశాఖ అధికారి సుభాషిణి, జిల్లా పిషరీస్ డిపార్టుమెంట్ అధికారి సుష్మిత తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంపై పోలీసు పోటు

- హైదరాబాద్‌లోని సాక్షి కార్యాలయంలో పోలీసుల హల్‌చల్
- ఎడిటర్‌కు నోటీసుల పేరుతో హంగామా
- జిల్లాలోనూ పలు సందర్భాల్లో సాక్షి కరస్పాండెంట్, ఇతర జర్నలిస్టులపై దాడులు




సాక్షి కడప: ప్రజాసామ్యంలో కీలకమైన పత్రికాస్వేచ్ఛపై పోలీసుల జులుం కొనసాగుతోంది. వార్తలు రాస్తే అడుగడుగునా వేధింపులు....మరోవైపు నోటీసుల పేరుతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. నెల్లూరు జిల్లాలో నకిలీ మద్యం వ్యవహారంపై వార్త రాశారన్న అక్కసుతో పోలీసులు ఏకంగా సాక్షి దినపత్రిక ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డికి నోటీసుల నెపంతో హైదరాబాద్‌లోని సాక్షి ప్రధాన కార్యాలయంలో పోలీసులు హల్ చల్ చేశారు. అంతేకాకుండా విచారణ పేరుతో సాక్షి ఎడిటర్‌ను ఇబ్బందులకు గురిచేయాలని చేయడంతోపాటు ఏదో ఒక రకంగా వేధింపులే లక్ష్యంగా అడుగులు ముందుకు వేశారు. మరోవైపు ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోనూ సాక్షి జర్నలిస్టులపై వేధింపులు కొనసాగుతూనే ఉన్నాయి. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత అడుగడుగునా జర్నలిస్టులకు ఇబ్బందులు పెడుతూ వేధింపులకు గురి చేస్తున్నారు.

- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో కూడా సాక్షి ప్రతినిధులపై దాడుల పరంపర కొనసాగుతోంది. ప్రధానంగా ఇటీవల సాగునీటి సంఘాలకు సంబంధించి ఎన్నికల నేపథ్యంలో....ఎలాంటి విపత్కరపరిస్థితులు లేకపోయినా వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల నియోజకవర్గంలో వేములలో జిల్లా సాక్షి టీవీ కరస్పాండెంట్ శ్రీనివాస్‌తోపాటు మిగతా సాక్షి జర్నలిస్టులపై కూడా దాడులకు పూనుకున్నారు. ఇవే కాకుండా సాక్షి జిల్లా బ్యూరో ఇన్‌చార్జి ఎం.బాలకృష్ణారెడ్డిపై కూడాజిల్లాలో పలు పోలీసుస్టేషన్లలో కేసులు నమోదు చేశారు.

వెల్లువెత్తుతున్న నిరసనలు

నకిలీ మద్యం వ్యవహారంపై టీడీపీ నేతలు అడ్డంగా దొరికిపోవడంతో ఏం చేయాలో తెలియక కూటమి సర్కార్ అడ్డదిడ్డంగా ముందుకు పోతోంది. ఈ నేపథ్యంలోనే సాక్షిలో వార్తలు రాస్తున్న పత్రికా ప్రతినిధులు, సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డి కూడా కేసులు నమోదు చేసి నోటీసుల నెపంతో హంగామా సృష్టిస్తున్నారు. ఇలాంటి వ్యవహారాలపై అటు అన్నమయ్య, ఇటు వైఎస్సార్ జిల్లాలో సీనియర్ జర్నలిస్టులు, పలు సంఘాల ప్రతినిధులు, సామాజిక వేత్తలు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి పోకడలు మంచివి కాదని, వార్తలు రాస్తే న్యాయపరంగా ముందుకు వెళ్లాలే తప్ప కేసులు పెట్టడం, అరెస్టులు, వేధించడం లాంటివి మంచి పద్ధతి కాదని పలువురు సూచిస్తున్నారు. కూటమి సర్కార్ ఇలాంటి ధోరణి అవలంభిస్తే రానున్న కాలంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని ప్రజాస్వామ్య వాదులు హెచ్చరిస్తున్నారు.

ఎడిటర్ పట్ల వేధింపులు తగదు



సాక్షి ఎడిటర్ ఆర్. ధనుంజయరెడ్డిని పోలీసులు వేధించడం తగదు. నోటీసులు ఇవ్వాలి తప్ప కార్యాలయాల వద్దకు వెళ్లి హంగామా చేయడం మంచిది పద్ధతి కాదు. ఏదైనా ఉంటే న్యాయపరంగా తేల్చుకోవాలి. కేసులు నమోదు చేసి వేధించడం, అరెస్టులు చేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు. జర్నలిస్టులు తప్పు చేస్తే లీగల్‌గా నోటీసులు ఇచ్చి న్యాయస్థానంలో పోరాడాలే తప్ప ఇలా చేయడం కరెక్టు కాదు.

– సి.వెంకటరెడ్డి, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కడప


ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు



రాష్ట్ర ప్రభుత్వం కక్షసాధింపు ధోరణిలో సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డిపై కేసులు పెట్టి వేధించడం తగదు. ఇలాంటి ఘటన ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు లాంటిది. అలాగే జిల్లాలో కూడా సాక్షి జర్నలిస్టులపై పదేపదే పోలీసులు కేసులు పెట్టి ఏదో ఒకరకంగా వేధించాలనుకోవడం మంచి పద్ధతి కాదు. ఇలాంటి పరిస్థితి ఉత్పన్నమైతే భవిష్యత్తులో ఉద్యమ కార్యచరణ రూపొందిస్తాం.

– పి.రామసుబ్బారెడ్డి, రాష్ట్ర నాయకుడు, ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్

పత్రికా స్వేచ్ఛను హరించడం తగదు



ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పని చేస్తున్న పత్రికా స్వేచ్ఛను కూటమి ప్రభుత్వం హరించడం సరికాదు. ఏ ప్రభుత్వంలోనూ ఇలాంటి పరిస్థితులు లేవు. సాక్షి ఎడిటర్‌పై అక్రమ కేసులు పెట్టడం దారుణం.వెంటనే కేసులుఉపసంహరించుకోవాలి.

–వైవీ శివయ్య, ఏపీ వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు

అక్రమ రవాణాకు అడ్డుకట్టేది.!

- చెట్లు నరికి అక్రమంగా లారీల్లో తరలింపు
- వాహనాల వద్ద మామూళ్లు వసూలు చేస్తున్న సిబ్బంది
- గుర్రంకొండలో మకాం వేసిన బయటి రాష్ట్రాల వ్యాపారులు



బయటి రాష్ట్రాలకు వెళుతున్న కలప లారీని ఆపి మామూళ్లు వసూలు చేస్తున్న సిబ్బంది



గుర్రంకొండ మండలం సూరప్పగారిపల్లె సమీపంలో బయట రాష్ట్రాలకు తరలించేందుకు సిద్ధంగా ఉంచిన కలపలారీ



గుర్రంకొండ మండలం సుబ్బిరెడ్డిగారిపల్లె- గుండ్లగుట్టతాండా మధ్యలో డంపింగ్ చేసిన కట్టెలను లారీల్లోకి లోడింగ్ చేస్తున్న కూలీలు

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లె, సరిమడుగు పంచాయతీల పరిధిలో కొంతమంది వ్యక్తులు అక్రమంగా చెట్లను నరికి వేసి లారీల్లో బయట రాష్ట్రాలకు తరలించుకుపోతున్నారు. వృక్ష సంపదను తరలిస్తున్న లారీలను అటవీ, రెవెన్యూ అధికారులు నిలిపి మామూళ్లు వసూలు చేసుకొని వదిలేస్తున్నారు. మండలంలోని బయట రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు మకాం వేసి ఇష్టానుసారం చెట్లను నరికేసి తరలించుకుపోతుండడం గమనార్హం.

రెండు గ్రామాల పరిసరాల్లోని కొండలు, గుట్టలతో పాటు పొలాల్లో పెద్ద ఎత్తున కలప చెట్లు ఉన్నాయి. వీటిపై అక్రమార్కుల కన్ను పడింది. స్థానికంగా ఉంటున్న కొంతమంది అక్రమార్కులు బయట రాష్ట్రాల వ్యాపారులతో బేరాలు కుదుర్చుకొని చెట్లను అక్రమంగా నరికి వేస్తున్నారు. కన్నుపడిందే తడవుగా చెట్లను అక్రమంగా నరికివేసి ట్రాక్టర్ల ద్వారా గ్రామాల్లో కొన్ని చోట్ల డంపింగ్ చేస్తున్నారు. ఆ తరువాత లారీల్లో అక్రమంగా నరికేసిన చెట్లను లోడింగ్ చెసి బయట రాష్ట్రాలకు తరలించేస్తున్నారు. గత పదిహేను రోజులుగా ఈ తంతు యథేచ్ఛగా సాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కొంతమంది బయట రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు ఇక్కడే మకాం వేసి ఇష్టానుసారం కలపచెట్లను నరికి వేసి అక్కడే కుప్పలుగా వేస్తున్నారు. వీటిలో నల్లతుమ్మచెట్లతో పాటు సండ్ర, వేప, చింతచెట్లు ఇతర కంప జాతులకు చెందిన వృక్షాలు ఉండడం గమనార్హం. వీటికి ఫ్యాక్టరీలు, ఇతర బొగ్గుల వినియోగం కోసం గత కొంతకాలంగా పదులకొద్ది వాహనాల్లో అక్రమార్కులు తరలించుకుపోతున్నారని గ్రామస్తులు పేర్కొన్నారు. ఎంతో విలువైన వృక్ష సంపదను నాశనం చేస్తున్నా అధికారులు పట్టించుకోలేదని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాల్సి ఉంది.

మామూళ్ల మత్తులో జోగుతున్న అధికారులు..

గత పదిహేను రోజులుగా పదుల సంఖ్యలో చెట్లను అక్రమంగా నరికేస్తున్నా అటవీ, రెవెన్యూ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారనే విమర్శలున్నాయి. ప్రభుత్వ భూముల్లో చెట్లను నరకడం చట్టరీత్యా నేరం. పట్టాభూముల్లో చెట్లను నరికి వేయాలన్నా రెవెన్యూ అధికారుల అనుమతి తప్పనిసరిగా ఉండాలి. అయితే ఇవేవి అక్రమార్కులు పాటించడం లేదు. చివరకు ప్రభుత్వ భూముల్లో చెట్లను కూడా అక్రమార్కులు నరికివేస్తున్నా పట్టించుకునే దిక్కులేదు. కొంతమంది రెవెన్యూ, అటవీశాఖ అధికారులు బయట రాష్ట్రాలకు కలపతో వెళుతున్న లారీలను ఆపి మామూళ్లను వసూలు చేసుకొని పంపించి వేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కలప అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఆటోను ఢీ కొన్న లారీ

ఒంటిమిట్ట : మండల పరిధిలోని కొత్తమాధవరంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటోను లారీ ఢీ కొన్న ఘటనలో ఆటోలోని యువకుడి కాళ్లకు తీవ్ర గాయమైంది. పోలీసుల వివరాల మేరకు.. రాజంపేట నుంచి కడపకు వెళుతున్న అరటికాయల ఆటోను కొత్త మాధవరం బస్టాండు సమీపానికి రాగానే కడప నుంచి రాజంపేట వైపు వెళుతున్న మహారాష్ట్రకు చెందిన లారీ ఢీ కొంది. దీంతో ఆటోలోని కడపకు చెందిన శివశంకర్(22) కాళ్లకు తీవ్ర గాయమైంది. గాయపడిన యువకుడిని చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు పోలీసులు కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



రాయచోటి టౌన్ : రాయచోటి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో గుర్తు తెలియని వ్యక్తి (50)మృతి చెందాడు. ఆస్పత్రి అధికారి వివరాల మేరకు.. నాలుగు రోజుల క్రితం గాలివీడు ప్రాంతం నుంచి 108 వాహనం ద్వారా రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చాడు. అప్పటికే తీవ్ర అస్వస్థతతో ఉన్న అతనికి చికిత్స చేసినప్పటికి పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందాడు. ఆస్పత్రిలో చేరిన రోజు తన పేరు చంద్రయ్య అని, ఊరు తిరుపతి అని చెప్పాడు. మృతుని వివరాలు తెలిసిన వారు తమను సంప్రదించాలని ఆయన కోరారు.

ఇంటి జాగా కోసం అన్నదమ్ముల ఘర్షణ

ములకలచెరువు : ఇంటిజాగా విషయంపై అన్నదమ్ముల మధ్య గొడవ జరగడంతో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం మండలంలో జరిగింది. పోలీసులు, బాధితుల కథనం మేరకు... మండలంలోని సోంపల్లెకు చెందిన అన్నదమ్ములు ఖాదర్‌వలీ, నజీర్‌లు ఇంటిజాగా విషయంపై గొడవపడ్డారు. ఈ గొడవలో ఖాదర్‌వలీ తలపై నజీర్ ఇనుపరాడ్డుతో కొట్టాడు. నజీర్ బంధువులు బీబీ, హుస్సేన్, ఫక్రుద్దీన్ కూడా దాడికి పాల్పడ్డారు. తీవ్రంగా గాయపడిన ఖాదర్‌వలీని కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి కుమారుడు ఖలీల్ ఫిర్యాదు మేరకు ములకలచెరువు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు జీఎస్టీ-2.0పై ర్యాలీ

రాయచోటి టౌన్ : రవాణా శాఖ ఆధ్వర్యంలో గురువారం జీఎస్టీ-2.0 సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ అనే అంశంపై ర్యాలీ నిర్వహిస్తున్నట్లు అన్నమయ్య జిల్లా రవాణాశాఖ అధికారి ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ర్యాలీ రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్ కాలనీ శివాలయం చెక్ పోస్ట్ వద్ద నుంచి బంగ్లా సర్కిల్ వరకు నిర్వహిస్తామన్నారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు.

పొట్టకూటి కోసం వచ్చి.. అనంత లోకాలకు..

- విద్యుత్ షాక్‌తో ఇద్దరు బీహార్ కార్మికుల మృతి
- మృతుల కుటుంబాలను ఆదుకోవాలని ఏఐటీయూసీ నాయకుల డిమాండ్



మృతి చెందిన బీహార్ కార్మికులు

పెద్దతిప్పసముద్రం : పొట్టకూటి కోసం బీహార్ నుంచి వచ్చిన ఇద్దరు కార్మికులు బుధవారం కరంటు షాక్‌తో మృతి చెందిన సంఘటన మండలంలోని కందుకూరులో జరిగింది. వివరాల్లోకి వెళితే ములకలచెరువు మండలం బిల్లూరివాండ్లపల్లికి చెందిన ఆవుల రాజశేఖర్ అలియాస్ రాజు అనే వ్యక్తి కందుకూరులోని వడ్డిపల్లి రోడ్డులో బాలక్రిష్ణ అనే వ్యక్తికి చెందిన ఖాళీ స్థలాన్ని లీజుకు తీసుకుని సిమెంటు ఇటుక తయారీ కేంద్రం నిర్వహిస్తున్నాడు. ఈ ఇటుకల తయారీ కేంద్రాన్ని సద్దాం అనే వ్యక్తి చూసుకునేవాడు. ఈ నేపథ్యంలో బీహార్‌కు చెందిన గుడ్డు షహని (27). ఇంద్రసన్ సహానీ (42)లు గత నాలుగు నెలలుగా ఇక్కడ కార్మికులుగా పని చేసేవారు. ఈ తరుణంలో ఎప్పటి లాగానే కార్మికులిద్దరూ బుధవారం ఉదయం ఇటుకల తయారీ యంత్రాన్ని ఆన్ చేయగా యంత్రానికి అమర్చిన మోటారు వైండింగ్ స్లిప్ తెగి ఇనుప యంత్రానికి విద్యుత్ సరఫరా కావడంతో బీహార్‌కు చెందిన కార్మికులిద్దరూ యంత్రానికే అతుక్కుని తనువు చాలించినట్లు డిస్కం ఏఈ గిరిధర్ ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న ఇన్‌చార్జి సీఐ గోపాల్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఐ నరసింహుడు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆర్ఐ హుసేన్, వీఆర్వో రమణ సమక్షంలో పోలీసులు శవ పంచనామా నిర్వహించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు. కరెంటు షాక్‌కు బలైన కార్మికుల మృతదేహాలను ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఉప కార్యదర్శి సలీంబాషా, నియోజకవర్గ అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి, బాలక్రిష్ణలు సందర్శించారు. ఇటుకల తయారీ కేంద్రం నిర్వాహకుడి నిర్లక్ష్యం వల్లే ఇద్దరు కార్మికులు బలయ్యారని ఆరోపించారు. ఈ ఘటనపై పోలీసులు, కార్మిక శాఖ అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టి మృతుల కుటుంబీకులను అన్ని విధాలా ఆదుకుని పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు.

మెలకువలు పాటిస్తూ పట్టు సాధిద్దాం

రామాపురం : పట్టును సాగు చేస్తున్న రైతులు మెలకువలు పాటిస్తూ లాభాలు పొందాలని రాయచోటి పట్టు పరిశోధన విస్తరణ కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రమ్య తెలిపారు. బుధవారం ఆమె మండల కేంద్రంలోని ఆర్బీకేలో పట్టు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టు సాగు ప్రారంభించే ముందు మట్టి పరీక్ష తప్పనిసరిగా చేయాలన్నారు. రసాయన ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువులు వినియోగం పెంచాలన్నారు. ట్రీ పద్ధతిలో సాగు చేయడం వలన ఆకుల నాణ్యత, దిగుబడి మెరుగవుతుందని చెప్పారు. పట్టు పురుగు పెంపకం సమయంలో ఉష్ణోగ్రత, ఆర్ద్రత నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కీటకాలు, వ్యాధుల నివారణకు వేపనూనె వినియోగించాలన్నారు. డ్రిప్ వాడకం ద్వారా నీటిని పొదుపు సాధించవచ్చని తెలిపారు. రాయచోటి సహాయ సంచాలకురాలు ఎం.రాధ మాట్లాడుతూ పట్టు రైతులకు వర్తించే పథకాలు, రాయితీలను వివరించారు. కార్యక్రమంలో రామాపురం ఏఎస్ఓ మెహరున్ బీ, ఏఎస్ఓ నాగ సుబ్బరాయుడు, ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

డ్రాపౌట్‌లను అరికట్టాలి



హాజరు పట్టీని పరిశీలిస్తున్న సమగ్రశిక్ష ప్రత్యామ్నాయ స్కూల్ కోఆర్డినేటర్ ఉలవల వెంకట్రామయ్య

గాలివీడు : విద్యార్థుల హాజరుపై దృష్టి పెట్టి డ్రాపౌట్‌లను అరికట్టాలని సమగ్రశిక్ష ప్రత్యామ్నాయ స్కూల్ కోఆర్డినేటర్ ఉలవల వెంకట్రామయ్య సూచించారు. బుధవారం మండలంలోని పలు పాఠశాలలను ఆయన సందర్శించారు. అనంతరం విద్యార్థుల హాజరు రిజిస్టర్లు పరిశీలించి దీర్ఘకాలంగా గైర్హాజరైన, తరచుగా గైర్హాజరయ్యే విద్యార్థులను గుర్తించారు. అనంతరం ఆయన ఎఫ్ ఏ-2 పరీక్షల నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకం అమలు అంశాలను సమీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గైర్హాజరు విద్యార్థుల కోసం ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించి తల్లిదండ్రుల ద్వారా విద్యార్థి తిరిగి పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల విద్యా అధికారులు నాగరాజు, శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు జాఫర్ బాషా, కృష్ణానాయక్, రమణారెడ్డి, వెంకటయ్య, సీఆర్పీలు సాంబశివ, భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న హిజ్రా స్వాతి

మదనపల్లె : తనకు జరిగిన అన్యాయంపై పోలీసులే న్యాయం చేయాలని లేని పక్షంలో ఆత్మహత్యే శరణ్యమని హిజ్రా స్వాతి ఆవేదన వ్యక్తం చేసింది. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ స్థానిక చీకలగుట్టలో ఉంటున్న దంపతులు దమరేశ్వర్, స్వర్ణలత తన దగ్గర నుంచి డబ్బు తీసుకుని ఇవ్వకుండా వేధిస్తున్నారని వాపోయింది. తనను నమ్మించి రూ.45 లక్షల నగదు, ఇంటికి సంబంధించిన డాక్యుమెంట్లు, బిడ్డల కోసం కొన్న బంగారు ఆభరణాలను తీసుకున్నారని, వాటిని తిరిగి చెల్లించాలని కోరుతుంటే బెదిరిస్తున్నారని పేర్కొంది. సీటీఎం రోడ్డులో తనపై దాడికి ప్రయత్నించారని కన్నీటిపర్యంతమైంది. ఒంటరిగా ఉన్న తనను ఏమైనా చేస్తారని భయాందోళన వ్యక్తం చేసింది. ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లానని, పైసాపైసా కూడబెట్టిన డబ్బును, బిడ్డల కోసం కొన్న బంగారు ఆభరణాలను తిరిగి ఇప్పించకుంటే తనకు చావే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేసింది.

ఒంటరి జీవితంపై విరక్తితో మహిళ ఆత్మహత్య



ఆ ఆబిదా (ఫైల్)

ప్రొద్దుటూరు క్రైం : ఒంటరి జీవితం గడపలేక షేక్ ఆబిదా (42) అనే మహిళ బుధవారం ఒంటికి నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సుందరాచార్యుల వీధికి చెందిన ఆబిదాకు రాజుపాళెం మండలం గోపల్లె గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహమైంది. వారికి ఇమాంఖాసీం అనే కుమారుడు ఉన్నాడు. తరచు మనస్పర్థలు రావడంతో భార్యా భర్తలు ఏడేళ్ల క్రితం విడిపోయారు. కుమారుడు ఇమాంఖాసీం రెండేళ్ల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ క్రమంలో ఆమె ప్రొద్దుటూరులోని సుందరాచార్యుల వీధిలో ఒక ఇల్లు అద్దెకు తీసుకొని ఒంటరిగా ఉంటోంది. ప్రభుత్వం నుంచి పింఛన్ వస్తుండటంతో ఆ డబ్బుతోనే జీవనం సాగించేది. కుమారుడు మృతి చెందడం, భర్త దూరం కావడం.. ఈ రెండు ఘటనలు ఆమెను మానసికంగా కుంగదీశాయి. దీంతో ఒంటరితనాన్ని భరించలేని ఆమె ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుంది. ఇంట్లో నుంచి పొగలు రావడంతో స్థానికులు గమనించి ఆమె బంధువులకు సమాచారం అందించారు. తల్లి, బంధువులు వచ్చేలోపే శరీరం పూర్తిగా కాలిపోయి ఆబిదా మృతి చెందింది. ఆబిదా తల్లి మెహరున్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్ఐ సంజీవరెడ్డి తెలిపారు.

కుటుంబ సమస్యలతో ఆత్మహత్యాయత్నం

మహిళ, ముగ్గురు పిల్లలను కాపాడిన పోలీసులు



భార్యాభర్తలకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏఎస్ఐ లక్ష్మీరెడ్డి

జమ్మలమడుగు రూరల్/మైలవరం : కుటుంబ సమస్యలతో తన ముగ్గురు పిల్లలు, తాను కలసి మైలవరం జలాశయంలో దూకి ఆత్మహత్య చేసుకోవాలని ప్రయత్నించిన మహిళను పోలీసులు కాపాడిన సంఘటన మైలవరం మండలంలో జరిగింది. ఏఎస్ఐ లక్ష్మీరెడ్డి ఇచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి. జమ్మలమడుగు పట్టణంలోని భాగ్యనగర్ కాలనీకి చెందిన మహేశ్వరిని తల్లిదండ్రులు నొస్సం గ్రామానికి చెందిన వెంకట శివకు ఇచ్చి 10 సంవత్సరాల క్రితం వివాహం చేశారు. వెంకట శివ పట్టణంలోని ప్రైవేట్ ఫైనాన్స్‌లో (డబ్బులు వసూలు చేయడం)తో విధులు నిర్వహిస్తున్నాడు. వీరికి 8, 5, 2 సంవత్సరాల ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. వీరు నంద్యాల జిల్లా, సంజామల మండలం నొస్సం గ్రామంలో కాపురం ఉంటున్నారు. భార్యాభర్తల మధ్య సమస్యలు రావడంతో జీవితంపై విరక్తి చెంది మైలవరం జలాశయంలో ముగ్గురు పిల్లలతో కలసి ఆత్మహత్య చేసుకోవడానికి ఆమె జలాశయం కట్టమీదకు చేరుకుంది. గమనించిన మైలవరం ఆటో డ్రైవర్ కుమార్ వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో రియాజ్, రమేష్, హృదయ్ అనే సిబ్బంది జలాశయం వద్దకు చేరుకుని మహిళను పోలీస్ స్టేషన్‌కు పిలుచుకొని వచ్చి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అనంతరం భార్యాభర్తలకు ఏఎస్ఐ లక్ష్మీరెడ్డి, సిబ్బంది కౌన్సెలింగ్ ఇచ్చి పంపించి వేశారు.


అబ్దుల్ కలామ్‌కు వైఎస్సార్‌సీపీ నాయకుల నివాళి



ఏపీజే అబ్దుల్ కలామ్‌కు నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాయచోటి అర్బన్ : రాష్ట్రపతిగా, క్షిపణి శాస్త్రవేత్తగా భారతదేశానికి విశిష్ట సేవలందించిన భారతరత్న ఏపీజే అబ్దుల్ కలామ్ జయంతి సందర్భంగా బుధవారం ఆయన విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం అధ్యక్షుడు బేపారి మహమ్మద్ మాట్లాడుతూ కడు పేదరికంలో జన్మించినా పట్టుదలతో తాను కోరుకున్న జీవితాన్ని సాధించి, దేశానికి విజ్ఞానసంపదను అందించారని కొనియాడారు. ప్రతి విద్యార్థి ఆయన అడుగుజాడల్లో నడిచి రాణించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శ్యామ్ కుమార్, షబ్బీర్ అహమ్మద్, అమీర్ ఖాన్, అజ్మతుల్లా, గౌస్ బేగ్, షేక్ మహమ్మద్, సమీర్ , పఠాన్, వసీం అహమ్మద్, ముబారక్, షౌకత్, ఫజిల్, అనీష్, సుబేల్, తౌఫిక్, జమీర్ అహమ్మద్ పాల్గొన్నారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్-19 బాల బాలికల జట్లు ఎంపిక



అండర్-19 హాకీ బాలికల జట్టు



అండర్-19 వాలీబాల్ బాల బాలికల జట్టు

మదనపల్లె సిటీ : ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్-19 బాల,బాలికల బాస్కెట్‌బాల్, హాకీ, హ్యాండ్‌బాల్, నెట్‌బాల్ జట్లను బుధవారం మదనపల్లె మండలం సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంపిక చేశారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. ఎంపిక కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ ప్రారంభించారు. ఎంపికైన జట్లు రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి డాక్టర్ బాబు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగరాజు, సెలక్షన్ కమిటీ సభ్యులు రెడ్డి శ్రీనివాస్, నరేష్, ఆసిఫ్, రియాజ్ పీడీలు ఉమాదేవి, ఉష, హరి, వేణు, యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సమావేశంలో రచ్చ

– ఓ ప్రజాప్రతినిధిపై చేయిచేసుకున్న వైనం

సాక్షి టాస్క్‌ఫోర్స్ : రాజంపేట ఆర్ఎస్‌రోడ్డులోని ఏబీ చంద్రారెడ్డి గార్డెన్స్‌లో బుధవారం నందలూరు, ఒంటిమిట్ట మండలాల కమిటీ నియామకాల సమావేశం నిర్వహించారు. సమావేశానికి పరిశీలకుడు వచ్చారు. ఈ సమావేశంలో ఒంటిమిట్ట మండలానికి చెందిన ఓ ప్రజాప్రతినిధిపై దాడి జరిగినట్లుగా ఆ పార్టీ వర్గాల్లో విస్తృత ప్రచారం జరిగింది. అదే మండలానికి చెందిన బీసీ నేత ఒకరు ఇటీవల జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన ఓ ప్రజాప్రతినిధిపై ఇన్‌చార్జి, పరిశీలకుని సమక్షంలోనే చేయిచేసుకున్నట్లుగా ఆ పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ప్రధానంగా ఒంటిమిట్టకు సంబంధించి ఉన్న మండల కమిటీనే ఉండాలని ఒక వర్గం వారు ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనను మరో వర్గం వారు వ్యతిరేకించారు. ఈ నేపథ్యంలో రెండు వర్గాలు కలిసి ఒంటిమిట్ట మండలానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి పై దాడి చేసినట్లుగా తెలుస్తోంది. మొత్తానికి ఒంటమిట్టి మండల కమిటీ నియామకం విషయం రసాభాసగా మారడం గమనార్హం.

వాటర్‌షెడ్ పనుల పరిశీలన



చెక్‌డ్యామ్‌ను పరిశీలిస్తున్న పీడీ వెంకటరత్నం

సుండుపల్లె : మండల పరిధిలోని సుండుపల్లె-2 గ్రామ పంచాయతీలోని సామిసేనిగడ్డ సమీపంలో చెక్‌డ్యాంలను విజయవాడ పంచాయతీరాజ్ డెవలప్‌మెంట్ శాఖ అధికారులు, జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరత్నం బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు డైరెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో 7 మండలాలను ఉత్తమ మండలాలుగా గుర్తించారని అందులో సుండుపల్లెకు మూడవ స్థానం రావడం అభినందనీయమన్నారు. అవార్డు కింద మండలానికి రూ.20 లక్షల అదనపు పనులను కేటాయించినట్లు తెలిపారు. అలాగే మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డుదారులకు త్వరగా ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి అశోక్‌రెడ్డి, ఏపీఓ మాలిక్‌బాషా, సంబంధిత అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రీటైల్ పోర్టల్ ద్వారా మద్యం విక్రయాలు

రాయచోటి జగదాంబసెంటర్ : లైసెన్సుదారులు తమ మద్యం దుకాణాలలో రీటైల్ పోర్టల్ ద్వారా స్కాన్ అయిన మద్యం సీసాలను మాత్రమే అమ్మాలని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ మధుసూదన్ తెలిపారు. రాయచోటి పట్టణంలో బుధవారం పలు మద్యం షాపుల యజమానులకు, నౌకరనామదారులకు ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా స్కాన్ చేసిన మద్యం బాటిళ్లను అమ్మే ప్రక్రియను ప్రత్యక్షంగా గమనించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని వారు కొన్న మద్యం సరైనదో కాదో తెలుసుకోవాలని సూచించారు. ఏ వినియోగదారుడైనా ఈ యాప్ ద్వారా తాము కొన్న మద్యం బాటిల్ ప్రభుత్వం సరఫరా చేసినది కాదని తెలిసిన వెంటనే జిల్లా ఎక్సైజ్ అధికారికి కానీ సమీపంలో ఉన్న ఎక్సైజ్ శాఖ అధికారి లేదా సిబ్బందికి తెలియజేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. నకిలీ మద్యంపై 79481216391 నంబర్‌కు సమాచారం ఇస్తే వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

వెట్టిచాకిరీ భరించలేక కార్మికురాలి ఆత్మహత్యాయత్నం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాగవేణి

మదనపల్లె : ఆరేళ్లుగా తమ నుంచి వెట్టిచాకిరీ చేసుకుంటున్న మగ్గాల నిర్వాహకుడి వేధింపులు తాళలేక చేనేత కార్మికురాలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన బుధవారం రాత్రి కురబలకోట మండలంలో జరిగింది. బాధితురాలు, ఆమె కుటుంబీకుల కథనం మేరకు వివరాలు.. రాయచోటి మండలం పెద్ద కోడివాండ్లపల్లెకు చెందిన దంపతులు ఆర్.రాజశేఖర్, నాగవేణి(32)లు చేనేత మగ్గం పనులతో బతుకుదెరువు సాగించాలని ఆరేళ్ల క్రితం కురబలకోట మండలంలోని చేనేత నగర్‌కు వచ్చి స్థిరపడ్డారు. అక్కడ లోకేశ్వర్ రెడ్డి అనే మగ్గాల నిర్వాహకుడి వద్ద పనికి కుదిరారు. ఆరేళ్ల క్రితం అతని నుంచి రూ.1.60 లక్షలు అడ్వాన్స్ తీసుకున్నారు. తర్వాత పని చేస్తూనే వారికి వచ్చే కూలీ సొమ్మును జమ చేస్తూ వస్తున్నారు. అయితే అడ్వాన్స్ తీరలేదంటూ చెప్పడంతో తాము వేరేచోట పనికి వెళ్లి మిగిలిన అప్పు తీరుస్తామని దంపతులు అతనితో చెప్పుకున్నారు. దీనికి అంగీకరించని యజమాని తన వద్దనే పని చేయాలని పేర్కొన్నాడు. తమతో పని చేయించుకోవడమే కాకుండా చీటీలు కూడా నడుపుతూ వాటికి కూలీ సొమ్మును జమ వేసుకుంటున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. కష్ట పడుతున్నా కూలీ కూడా చేతికి రాకపోవడంతో ఇంటికి బాడుగ కట్టుకోలేక, పిల్లల్ని చదివించలేక ఇబ్బందులు పడుతూ వస్తున్నామని చెప్పారు. ఈ పరిస్థితుల్లో నాగవేణి ఇంటిలో ఉరి వేసుకొని ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. పిల్లలు చూసి కేకలు వేయడంతో స్థానికులు, కుటుంబీకులు మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. పరీక్షించిన వైద్యులు చికిత్సలు అందిస్తున్నారు. తమను మగ్గాల యజమాని నుంచి విముక్తిని కల్పించాలని కుటుంబీకులు కోరుతున్నారు.